# నిర్హేతుకం

నవులూరి వెంకటేశ్వరరావు-

సాయం సంధ్యలోంచి దూసుకెళుతోంది ఒగరుస్తూ. ఎక్స్‌ప్రెస్ కాబట్టి ఎక్కువ చోట్ల ఆగి ఊపిరి తీసుకునే అవకాశం లేదు. సూర్యుడు ఒరిగే సమయం అయినా ఎండలో తీక్షణత. సాయం సంధ్యకూ, ఎండకూ పొంతన లేదు.

వెళ్ళిపోతున్న సూర్యుణ్ని దిగులు కళ్ళతో



చూసి, చూపును పక్కకొచ్చి నిలబడ్డ భార్య వైపు మళ్ళించాడు. బైర్లుకమ్మిన కళ్ళతో ఏమీ అర్థంకానట్లు తన ముఖంలోకి చూస్తున్న అతనితో అంది - "ఏం, నన్ను గుర్తుపట్టటానికి ప్రయత్నిస్తున్నారా?"

చిన్నగా నవ్వి, "అవును అలవాటుకాని వ్యక్తివి గద. మన మధ్య కొత్తదనం ప్రాతపడ టం మొదలవ్వలేదు", అన్నాడు.




"పోనీలెండి, పాతబడేవరకూ 'నేను మీ భార్యను' అని చెవిని ఇల్లు కట్టుకుని పోరుతుంటా."

"అల్లక్కడ చూస్తుండటంవల్ల కళ్ళు..."

"దాన్నంతలా చూడాల్సిన ప్రత్యేకత?"

"పండిన ఎండలో ఆ తీవ్రతేమిటా అని' ఎదురు సీట్లో కూర్చున్నాయన తదేకంగా గమనిస్తున్నాడిద్దర్ని.

"మరో అరగంట పడుతుంది గదండి?' ' విష్ణు అతన్ని అడిగాడు.

"ఆఁ మధ్యలో అవసరంగానో, అనవస రంగానో ఆగిపోకపోతే."

"ఇప్పటికే రెండుమూడు సార్లు...

అంతకు క్రితం తాగివదిలేసిన గ్లాసులు కడగటానికి వెళ్ళిపోతోంది. ఆ శరీరంలో చురుకుదనం, ఉత్సాహం, రెండు మూరల కనకాంబరపు మాల మడిచి జడ మొదట్లో ముడిచింది (అందమయిన ఆపూలకు వాసనేది; పైగా అవి అర్ఫకమయినవి) అదేరంగు చీర, ఎర్రగాజులు, పశ్చిమపు ఎండ పడి మిట్ట మధ్యాహ్నపు కాసుచిచ్చులా తోస్తోందామె. పాలిపోయిన మంట. మానవా రణ్యంలో రగిలిన ఈమంట ఎలా దహిస్తుందో. ప్రతి చిన్న కదలికకూ, తగిలే గాలికీ ఊగుతూ, ఎగురుతూ, తేలికదనంలో గాలితో పోటీ పడుతోంది. వాసనలేని, అందమైన ఆ పూలదండ.

"బస్సులు దొరుకుతాయి కదూ స్టేషను దగ్గిర?"

"ఒకటే బస్సు తిరుగుతుంటుంది కొండకు స్టేషనుకు. ఈ రైలు ఆ స్టేషను చేరేసమయానికి ఒక ట్రిప్పు వుంటుంది. కానీ ఈ రైలు అలస్యంగా నడుస్తోంది" (నవ్వు), అవును మాస్టారూ నడుస్తోంది. కాబట్టి మీరా బస్సును అందుకోగలగొచ్చు, అందుకోలేకపోవచ్చు. ఒక వ్యవస్థ, ఒక క్రమపద్ధతి, ఒకగ్యారంటీ జరిగే జీవిత వ్యవహారాల్లో, సంఘటనలలో, సంఘంలో, ప్రకృతిలో - లేవుగదా. ఒక ప్రత్యామ్నాయం వుందండోయ్. అదే గుర్ర బ్బగ్గీ! మీకు గుర్రబ్బండి ఎక్కాలన్న సరదావుంటే అది తీర్చుకోవచ్చు (నవ్వు)..." దగ్గు అతని గొంతుకు ఆనకట్టవేసింది. లేకపోతే మాటల వరదలో జంట మిగిలేదికాదు.

రాత్రంతా మందుకొడుతూ, సణుగుతూ, నిద్రపట్టినపుడు ఏదో పలవరిస్తూ, మధ్య మధ్యలో నవ్వుతూ వున్నాడు. అయన పలవరించని, సణగని మాట్లాడని విషయం లేదు. సృష్టిని, మానవ జీవితాలను చక్కదిద్దే బాధ్యత, శక్తిసామర్థ్యాలు వుండి వుంటే లోపాలను, చెడును బహిష్కరించి, మంచిని పరిపూర్ణతను అవిష్కరించి వుండేవాడు. (ఆవిష్కరించి నవ్వి వుండేవాడు) అతని తత్వాన్ని ముందే గ్రహించి ఆ కందిరీగ తుట్టెను ఎక్కువగా కదిలించకండి అని కాదంబరి హెచ్చరించివుంది. "ప్రయాణపు విసుగుదల నుంచి తప్పించుకోవటానికి అతనొక సాధ నంగా ఉపయోగపడతాడు" అని ఆమె చెవిలో ఊదినా, తన జాగ్రత్తలో తనూ వుంటూనే వచ్చాడు.

గుర్రపుబండి! ఒకనాడు - చాలా సంవత్స రాలక్రితం - అదెక్కడమంటే ఎంతో సరదా. భూమి ఒక అంచునించి మరొక అంచుకు దాంట్లో ప్రయాణం చెయ్యాలన్న సరదా. మాయ, ఆలోచన, విచారాలు చోటుచేసుకోని బాల్యపు వయసు కోరిక ఇప్పుడు తీరుతుంది. చక్కటి సమయంలో అతి చక్కటి అవకాశం

ఆమె తిరిగి వచ్చింది మొహం కడుక్కుని, తేమ లేకుండా తుడుచుకుని. తేటగా వుంది. బాధ, విచారం, కోపం, ద్వేషం, అసంతృప్తులను కడిగేసిన మొహం. అవేం లేకపోతే, మొహాలిలా వుంటాయన్నమాట. జుత్తును చెవులమీదినించి సర్దుకుంది. జారకుండా చెంపపిన్నుపెట్టింది. కనీ కనబడకుండ కింది కనురెప్ప దించి దిగువకు కాటుక చెదిరింది. ఆమె మొహం ఆకాశంలా ఒక్కొకసారి ఒక్కొ రూపులో కనిపిస్తుంటుంది.

ఆ తుపాను రోజుల్లో ఒక రాత్రంతా కరెంటు లేదు. లాంతరు వెలిగిస్తోంది. తనకు తను ఆ మంటలా తోచాడు. ఆమె చిమ్నీ ఆరిపోకుండా ఆమె కాపాడుకొస్తున్నందుకు కృతజ్ఞత కలగలేదుగదా ఆరిపోయే అవకాశాన్ని, స్వేచ్ఛను లేకుండా చేస్తోందని కినుక కలిగింది. ఇంటి కప్పులనించి క్రిందికి వేలాడే ఇనుపచువ్వ కొక్కానికి, కాలి వేళ్ళమీదలేచి సాగి లాంతరు తగిలించే సమయపు ఆమె రూపు మనసులో చెరగని చిత్రంగా మిగిలి పోయింది.

రోగంతో తీసుకుంటున్న అదే దినాలలో చెరగని జ్ఞావకంగా బహుశా మరొక అనుభవమూ నిలిచిపోతుంది. వమనం చేసుకున్నపుడు ఆమె చీరంతా పాడు చేశాడు. తన దౌర్బల్యాన్ని తనంతట తాను నగ్నంగా వ్యక్తం చేసుకున్నట్లయింది. ఒక చేత్తో అతన్ని పొదివి పట్టుకుని మరో చేత్తో విష్ణు కింది దుప్పటిని లాగి పడేసింది. ఆమె బలంలో సీత. సిగ్గుతో అవతలివైపు మళ్ళి పడుకుండి పోయాడు పలుకరించినా పలకకుండా.

వివాహం అయిన కొద్ది రోజులకే ముంచుకొచ్చిన జబ్బు ఈ ప్రయాణానికి అవకాశాన్నిచ్చింది. వారం రోజులు ఆ చోటున విశ్రాంతిగా, ప్రశాంతంగా గడపొచ్చు. ఈ ఊరెళ్ళాలన్న కోరిక ఈ నాటిది కాదు. బాల్యపు నాటిది, బలమైనది. ఈనాటికి సాధ్యపడుతోంది. సందర్భం కలసి రాకనా? కావచ్చు, కాకపోవచ్చు, మరోకారణం వల్లగావచ్చు, ఏ కారణం లేకుండా గూడా కావచ్చు. ఏదైనా కారణం వల్లే అన్నీ జరుగుతున్నాయా? సృష్టి సంఘటనలకు మాత్రం ఏ తర్కం ఆలంబన?

రైల్లోనించి బయటికి చూశాడు. చిన్న కోరికలు తీరటానికి కూడా ఒక జీవితకాలం పట్టొచ్చు. అవసలు కారణరహితంగా కూడా తీరకపోవచ్చు. తీరా, ఒకవేళ అవితీరితే, ఆ క్షణానికి కోర్కె నశించిపోయి ఆనందం వురడదు. జీవితం ఒక బాకీ తీర్చినట్లు తీరుస్తుంది.



వాళ్ళు పడుతున్న నౌకర్ని అడిగాడు గుర్నాథం.
"ఇంతకు ముందు ఏం పని చేసేవాడివి?"
"చెప్తే ఏమీ అనుకోరు గదండయ్యా!"
"అనుకోనులే చెప్పు!"
"మీ ఊళ్ళో గేదెలను కడిగేవాడ్నండయ్యా"

చావును కూడా చెరచగల శరీర సౌష్టవం ప్రక్కన చేరింది.

ఉత్సాహం నిండిన కళ్ళతో కాదంబరి బయిటికి చూస్తోంది. గడ్డం దగ్గిర మచ్చ. అసలే అందమయిన ముఖానికి మరింత అందమిచ్చే మచ్చ. మచ్చలు సిగ్గుపడేట్లు చేసేవి, అవమానాల పాలు చేసేవి - అందాలు కూడా ఇస్తాయి. మొహంలో ఆరోగ్యం, అందం, ప్రశాంతత, మరో విధంగా వుండలేనంటుందా వదనం. విచార ఛాయల ఆవాలు ఈ అద్దం మీద వుండవు. తనలో అవి ఎందుకు వేళ్ళుతన్ని వుండి పోయాయి? వివాహంలాంటి ముఖ్య జీవిత ఘటనా మార్చుతేలేకపోయింది? చిన్నప్పటినించి విచారం పేరుకుపోయి, ఘనీభవించి వుంటుంది. వివాహాలూ అలాంటివి రూపుమాపలేవు. శరీరంతోపాటు ఆ ఛాయలూ తగలబడి బూడిదవ్వాలంతే. అప్పుడూ, మిగిలే ఎముకల నాశ్రయించివుండి పోతాయేమో.


తెలివిగా మాట్లాడగలదని, ఆలోచించగలదని అనుకోలేదు. నలభై సంవత్సరాల వ్యక్తి తన జీవిత భాగస్వామిలో కోరుకునే మానసిక పరిపక్వత ఈ ఇరవై ఎనిమిదేళ్ళ వ్యక్తిలో దొరకదేమోననుకున్నాడు. "పైగా, బలమైన అవయవాల పొందికతో ఏర్పడిన శరీరంలోని మేధకు పదునుంటుందా?"

ఎడమ చెయ్యి కిటికీ చట్రం మీద ఆనించి నిలిపిన చేతిలో గడ్డం ఆనించి ఆలోచిస్తోంది. ఏమాలోచిస్తుంటుందా మనసు ఈ క్షణాన? రైలు ప్రయాణాన్ని మరో ఆలోచన లేకుండా ఆనందిస్తున్నట్లుంది.

... రైలు వింతయంత్రం ... అందని అందలం ... విచిత్రమైన సృష్టి ... స్టేషన్లో ముసలి పోష్టరు కొట్టే గంట మోగుతుంది... ఒక ఘనకార్యం చేస్తున్న మనిషిని చూస్తున్న భావన.... అదికొట్టకపోతే అతను కొట్టకపోతే రైలు రాదు.... ఓవర్ బ్రిడ్జ్ ఎక్కితే ఆకాశం చేరినట్లు ... మచ్చ పెద్దదవుతూ, స్పష్టతను సంతరించుకుంటు దూరాన్ని ఛేదించుకుంటు వస్తుంటుంది; శబ్దాన్ని మాత్రం రహస్యంలా దూరం కాపాడుతుంది తాత్కాలికంగానే కావచ్చు.... కాకి తంతుంది నెత్తిమీద - ఆ బ్రిడ్జ్ దాని బాబుదన్నట్లో, మందలిస్తున్నట్లో ... కాకితన్నిందని ఇంట్లో చెబితే, స్నానం చేసి రాపోరా బదుద్దాయి అంటుంది నాయనమ్మ నెత్తి మీద గుడ్డను సవరించుకుంటు ... గంట కొట్టడమనే గర్వించదగ్గ పనిచేసి, అలసట తీర్చుకుని, దీపస్తంభపు చిమ్నీ గాజు తలుపు తీసి వత్తి వెలిగించే ప్రయత్నం చేస్తాడు... చక్రాల అందలం వెళ్ళిపోవటానికి ఎదురుచూసిన సమయంలో వెయ్యోవంతు పట్టదు ... అందులో పయనించటానికి ఏవో అర్హతలుంటాయి ... అందరూ కూర్చొటానికి నిర్దేశించిందికాదు. పెద్దయ్యాకనైనా అందులో కాలిడ కలడా?

పై బెర్తుమీద మనిషి గురకపెడుతున్నాడు. రాత్రంతా విష్ణు కూడా నిద్రపోలేదు. ప్రయాణంలో నిద్రపట్టదు. పడుకుని, కళ్ళు మూస్తూ తెరుస్తూ, రైలు మీద విసుక్కుంటు, హాయిగా నిద్రపోతున్న భార్యమీద కించిత్ అసూయపడుతూ, గడిపాడు. కళ్ళు తెరిచి చూసినపుడల్లా పై బెర్తు మీద కూర్చునో, ఆవలిస్తూనో, బాత్రూం కెలుతూనో, కంపార్టుమెంట్లో ప్రచార్లు చేస్తూనో, నిద్రపోతున్న వాళ్ళను పరికిస్తూనో గడిపాడు ఆ ఆసామి. ఇపుడు నిద్ర. నిద్ర ఇప్పుడు! రాత్రిపని పగలు, పగలు పనిరాత్రి. నోరు తెరుచుకు మరీ. తలకింద ఒత్తుగా వుంచుకున్న చేతిమీదికి చొంగ కారుతోంది. అకాలపు నిద్ర, సాగి వేలాడే కడుపు - అసహజంగా, వికృతంగా.

రైలు వేగం తగ్గించుకొంటోంది. ఆమె




కిటికీకి తల అనించి బయటికి చూసి, "ఎక్కువసేపు ఆగదేమో, తయారవుదాం" అని లేచి నిలుచునిపై బెర్తు మీద నించి సూట్‌కేసు కిందికి దింపి, అంది:

"ఆ రెండూ మీరు పట్టుకోండి, దీని సంగతి నేను చూసుకుంటా".

విష్ణు ఏదో చెప్పబోతే ఆమె వినలేదు. అతను చెప్పబొయ్యేది ముందుగా తెలిసినట్లు, తను తీసుకున్న నిర్ణయం సరైనదే నన్న స్థిరాభిప్రాయంతోవున్నట్లు. రైల్లోనించి సూట్‌కేసుతో పాటు దిగింది. అతను ఏర్‌బ్యాగు భుజానికి తగిలించుకుని, ప్లాస్టిక్ బాస్కెట్ ఒక చేత్తో పట్టుకుని నింపాదిగా దిగాడు. రైలు కదిలింది. వాళ్ళు భరించిన రైలు, వాళ్ళను భరించిన రైలు.

* * *

సామాన్లతో మెయిన్‌రోడ్డు మీదికొచ్చారు. ఇప్పుడు ఏ రైలైనా వుంటుందో లేదో తెలీదు. ముందు స్టేషను చేరితే సగం ఊరు చేరినట్లు భావించేట్లున్నాడు. దేవస్థానం వాళ్ళ షటిల్ ఎప్పుడొస్తుందో తెలీదు. అంతా అనిశ్చిత. అందుకే దైవాదీనం మోటర్ సర్వీసు అన్నారేమో. బహుశా స్టేషను చేరిన వెంటనే, పరిహాసించటానికన్నట్లు వెనకనే వస్తుంది. రైలూ, తాము స్టేషను చేరబొయ్యే తరుణానికి, కళ్ళముందునించే ఊరిస్తూ కదిలిపోతుం దేమో.

ఎదురుగా గుర్రబ్బండి. గుర్రాన్ని విప్పి బండికే కట్టేసి గడ్డి తినిపిస్తున్నాడు.

"గుర్రబ్బండి ఎక్కుదామా?"

నవ్విందామె

"గుర్రబ్బండేస్తావా?"

వాడు విన్నట్లు లేదు.

'గుర్రబ్బండేస్తావా?"

లెక్కచేసినట్లులేదు. వాడి దగ్గరగా వెళ్ళి, పై మాటలు దొర్లిస్తే అప్పుడు తల ఊపాడు.

"ఏం కావాలి?"

వినిపించుకోలేదు. వాడికి చెముడు. వాడికి వినబడేలా; ఒకవేళ వినబడకపోయినా అర్థంకావటానికి, సంజ్ఞలు కూడా చేస్తూ వాడితో సంభాషించి బేరం కుదిర్చాడు. వాడిది 'బ్రహ్మ' చెముడు.

అరచేతి మందపు కళ్ళజోడును తీసి వాడికి కనబడని దూరానికి చూస్తూ, ఆలోచిస్తూ వాటిని తుడిచి తిరిగి పెట్టుకుని కళ్ళు చికిలించి చూస్తూ ప్రయాణానికి బండిని ఆయత్తం చేస్తున్నాడు.

బలిసిన గుర్రం. వాలే ఈగల్ని మాత్రం ఏమీ చెయ్యలేక, అశక్తతకు కొంత ఆశ్చర్యంగా, కించిత్ విచారవైరాగ్యాలుగా - బలవంతమైన సర్పము చలిచీమల చిక్కి చావదె సుమతీ అన్న విషయం గుర్తుకొచ్చి నట్లు మేస్తోంది. - ఈగల హింసతో, వ్యథలతో కూడిన జీవితంనుంచి తప్పించుకునే మార్గం - చావువినా - లేదని, గ్రహించి, విజ్ఞతతో అలాంటి జీవితానికి అలవాటుపడి మేస్తోంది పశువు.

బండికి కట్టడానికి దాని కళ్ళెం పట్టుకులాగపోతే మొరాయిస్తోంది - ఈ అర్భకపు వెధవను ఖాతరు చెయ్యడమా అనీ; ఎప్పుడూ బండిని తనే లాగాలా, ఈ ఒక్కసారి బండే తనను లాగకూడదా అన్న భావాలు మదిని తొలుస్తున్నట్లు. పశువుకూ అభిప్రాయా లుంటాయి, అహం వుంటుంది. ఎంత బలమైన గుర్రం! ఒళ్ళంతా పట్టులా మెరుస్తోంది. అంత అందం, అంత బలం ఒక బక్కపీనుగ, చుట్టకంపు వికారి ముందు బలాదూర్. అన్నట్లు: ఈగల నేమీ చేయలేక వాటితో, అహంమింగుకుని రాజీపడిన హస్యం, అర్భకపు వెధవ దగ్గిర కొచ్చేసరికి అహం ఎందుకు కనబరుస్తోంది? కనబరిచీ అది సాధించగలిగేదేమీ లేదు. ఒక కర్ర ముక్కకు కట్టిన తోలుపీలికకూ లొంగక తప్పదు. పీనుగకు, తోలుముక్కకూ బానిస కాక తప్పదు.

ఒక అన్యాయాన్ని నిరశిస్తూ పోరాడటం అన్నది ముఖ్యం. ఫలితం ఎలా వున్నా అన్నట్లు మొరాయిస్తోంది. దానికీ మనసుంది. అది వున్నందుకు - ప్రణంలాంటి అది వున్నందుకు, ఆ నలుపుడుతో బతికున్నంత వరకూ చావాల్సిందే.

ఎప్పటిలానే తోలు గెల్చింది, అది చేతబూనిన అస్థిపంజరం గెల్చింది. గెలవటం దాని వాడి జీవిత విధానం అన్నట్లు.

బండికీ, గుర్రానికీ కూడా పొంతనలేదు. కీళ్ళరోగపు పేదబండి. అదీ, బక్కపీనుగ మేడ్ ఫర్ ఈచ్ అదర్. మూడవ భాగస్వామికి ఈ ఇద్దరితో కూడవలసి రావటం కన్న అవమానం మరొకటి లేదు. మనిషికి మాత్రమే తెలిసిన ఆత్మహత్య అనే సాధనం తెలిసివుంటే ఆపని మరో ఆలోచనకు తావియ్యకుండా చేసుండేది.

"బండి స్టేషనుకు చేరుస్తుందా?"

గుండెల్లో గుర్రం తన్నినట్లు విలవిల లాడాడు వాహన చోదకుడు.

"భలేవారండా ..." పై మాటలు చాలా బుద్ధి పొరపాటు వన్న విషయం చూపుతో వ్యక్తం చేసి, ఈ మూర్ఖుడిదగ్గిర వాక్యం పూర్తి చేయడం వృథా అని మధ్యలోనే దాన్ని వదిలేసి గుర్రాన్ని బండికి బంధించటంలో మునిగాడు.

"ఎక్కండా!"

మొదలయిందిక యాత్ర. మానవజీవిత యాత్ర! ఈ బండి ఏక్షేత్రదర్శనకు గొని పోవునో!

"ఇది రాజాలాంటి గుర్రం. ఈ సుట్టు పక్కల లేదిలాంటిది."

"మరి బండిమాట?"

వాడికి ఆ కంఠస్థాయిలో వినబడని మాటలు

ఆమె ముందు కూర్చుంది ఒక పక్కకు. రెండవ పక్కకు బండి మధ్యకుండేలా కూర్చున్నాడు విష్ణు.

బండి వూవుతోంది మొరటుగా, సెన్సువసగా. చక్రాలకిందబడి రాళ్ళు నలుగు తున్నాయి. రాటుతేలినవి కుదుపుతున్నాయి పొగరుగా కందెన వేసినట్లు లేదు. ఇరుసులు, అవి దూరిన చక్రాలు కీచుమంటున్నాయి. బండికి, చక్రాలకు, గుర్రానికి, రౌతుకు పొంతనలేదు అయినా యాత్రసాగుతోంది. అదెలా' వుంటేనేం సాగుతోంది గదా! రౌతు, బండి ఎలాంటివైతేనేం ముందుకే గదా గమనం. ఎముకలు విరిగి, బుర్రలు వగిలితేనేం, రక్తమాంసాల ఎముకల ప్రోగులను కొనిపోవటం జరుగుతోంది.

ఎంత బలమైన గుర్రం? బలిసిన వెనుక భాగం. ఆమె గుర్రాన్ని చూస్తోంది. తల ఎగరేస్తూ పొగరుగా పోతోంది - తన చేయిపైనే అన్నట్లు. నోరు ఆడిస్తూ లాక్కుపోతోంది ఒక బక్క రౌతుని, ఒకస్త్రీని, ఒక పురుషుణ్ని, ఒక అవశేషాన్ని. పట్టుచర్మం - మృదువైనది, విలువైనది. దాని మీద చెలుకోల దెబ్బలు! చెలుకోల దెబ్బలు వట్టుదనం మీద, మృదుత్వం మీద బలమైన వెనుక కండరాల మగ గుర్రపు నాట్య కదలికలు. శక్తికిచ్చిన మాంసపు రూపు. గుర్రాన్ని మౌనంగా ఆమె చూస్తుండటం అతను గమనించాడు. బలమైనది విలువైనదే అయినా అది మూగది. బాధపడటమేగాని, వ్యక్తం చేయలేనిది. బలమైన, విలువైన, మూగజీవిని అనవసరంగా కొడుతున్నాడు ఒకే ఒక గుర్రపు కుమ్ముకు కిక్కురు మనకుండా చచ్చే బక్కడు. అది చూడలేక, "బండిని బాగానే లాగుతోంది గదా దాన్నెందుకలా వృథగా హింసించటం" అన్నదామె. ప్రతిదీ హేతుపూర్వకంగా జరుగుతున్నట్లు. ఆమె మొహంలో దేని గురించో వెదికాడు విష్ణు. గుర్రం తప్ప ఆమెకు వింత గొలిపే దేదీలేనట్లు దాన్నే పరికిస్తోందామె.

"ఒరే రాయుడూ, నా కొడకా, దారి మరిసి పొయ్యావా..." మల్లు బనీనులోనించి బీడీ తీసి తోలుకన్నంలోకి తోసుకుని నిప్పంటించాడు. బీడీకి; నిజానికి అంటించాల్సిన దానికి కాదు. అసలే కోతి అన్నట్లు, తాగికూడా వున్నాడేమో.

చెలుకోల, సింఫొనీ కండక్టర్ చేతిలోని బ్యాటన్‌లా విన్యాసాలు చేస్తోంది. గుడ్డీ, చెముడుతనాల బక్కతనం చేతిలో బ్యాటన్! బేటోవెన్ సిగ్గు పడేలా సింఫొనీ కంపోజు చేసి, కండక్టు చేస్తున్నాడు. చచ్చినట్లు వినటం కన్నా మరో మార్గమే ముంది? అనవసర బ్యాటన్ విన్యాసాలు చేస్తూ, నోటికే పనిచెబుతున్నాడు, తన సింఫొనీకి తనే తన్మయత్వం చెందుతూ గొంతు కలుపుతూ చుట్ట - బీడీల నిలయం నించి తేనె లొలికే భాష; ఏరి కూర్చిన మాటల సౌరభం. అవి విన్న తర్వాత వీనులుమరేం విన ఇచ్ఛగించక పూడిపోవును, ఊడిపోవును.

చిన్నప్పుడు గుర్రం, గుర్రబ్బండంటే ఎంతో సరదా. డెక్కల చప్పుడు సంగీతపులయ, గుర్రపు పరుగు నాట్యం. దాని బానిసత్వం, పడే యాతనలు తెలీని వయసది. బండి చక్రాలలో చెలుకోల కర్రతో చేసేశబ్దం ఒక సంగీతపు ధ్వని. గుర్రపు బండ్లశాల కెళ్ళి అలా చూస్తూ నిలబడిపొయ్యేవాడు, రెప్ప వెయ్యకుండా చూస్తూ. గడ్డి, మూత్రంలో నాని వేసే వాసన రోత కలిగించేదికాదు. ఈనాడు, ముద్ద సంపంగి వాసనా చికాకు కలిగిస్తుంది. గళ్ళలుంగీలు కట్టి కరీం బీడీలు తాగుతూ ఉర్దులో అక్కడక్కడ తెలుగు చిలికిస్తూ మాట్లాడుకునే జట్కా సాహెబులు అందరిలాంటి సామాన్యులుకాదు. వాళ్ళభాష, కేకరింపులు, కేకకూడా ఇష్టమైనవే. చాలా తక్కువసార్లు గుర్రబ్బండెక్కుంటాడు బాల్యంలో అంత ఇష్టమైన అనుభవమే అయినా ఆమె అసలే పెద్దవయిన కళ్ళు విప్పారగా గుర్రపు గమనాన్ని గమనిస్తోంది. ప్రపంచ ఎనిమిదో వింతలా. వింతలు కాని వాటిని కూడా వింతలుగా చూడగలిగిన శక్తిపోని కళ్ళతో. చిన్న విషయాలూ ఎంతనూ ఆసక్తినీ కలిగిస్తుంటే. జీవితం విసుగు పుట్టించదు, కాలం గడిచిపోతుంది. చావు గురించి వేచి వుండటంలో విసుగు వుండదు.

ఇరవై ఒకటో శతాబ్దపు వాకిలి ముంగిట ఈ గుర్రబ్బండి ఒక అవశేషం. దానికి కాలం చెల్లిన ఈ తరుణంలో ప్రయాణం చెయ్యటం సిగ్గు కలిగించే అంశం. ప్రయాణంలో సుఖమూ కనబడటం లేదు. రోడ్లన్నీ గోతులు; ఎముకల వ్యాధితో తీసుకుంటున్న బండి; బక్కపీనుగు సారథ్యం - ఈ ఎన్నోక్రోని జానికి మకుటంలా. రెండు నిద్రలేని రాత్రులు తెచ్చిన అలసట; ఒళ్ళునెప్పులు, నడుం కలుక్కుమంది బండి గోతిలోబడి.

"బండి ఆపవయ్యా" సారథికి వినబడే స్థాయిలో అరిచాడు.

జారిపొయ్యే కళ్ళజోడు పైనించి అనుమానంగా చూస్తూ, "ఓ..అ..అ..ఆ.. ఆగరా రాయుడూ... నా... క..." అని అదిలిస్తూ రోడ్డు పక్కగా ఆపాడు.

"ఏం?" అందావిడ.


"నేను నడుస్తా మీరుపదండి, కొంచెం దూరమేగా..."

"వచ్చేశాం... కూచోండయా..."

"పోనీ పోనీ... నా కాళ్ళు సాగుతాయి."

బండి సాగింది. భర్తను బండి వెనక వైపు క్షణం పాటు చూసి చూపు ముందుకు మళ్ళించింది. బండివాడు బండబూతు తిట్టి రాయుడ్ని పరుగెట్టించాడు.

స్టేషను చేరటానికి అయిదు నిముషాలు పట్టింది. స్టేషను వెనక ఒక మూలగా ఆగింది బండి. విష్ణు వాళ్ళని చేరేసరికి సూట్‌కేసు, బ్యాగు రెండు చేతుల్లో పట్టుకుని తయారుగా




నిలబడింది. డబ్బులిచ్చేశాడు. స్టేషన్లో కెళ్ళారు టిక్కెట్లు కొనుక్కుని. రైలు అసలుటయింకు రావాలన్నా మరో గంట పడుతుంది. సిమెంటు బల్లమీద కూర్చున్నారు. ఆమె జుత్తు చెరిగి వుంది. పూలు లేని జడ. పట్టాలను చూస్తోంది మౌనంగా, దీక్షగా. అతనూ పట్టాలను అంత ఆసక్తిగా, దీక్షగా చూటానికి ప్రయత్నించేసి ఆవులించాడు.

కలిసే అవకాశం లేకపోయినా ఒక పట్టా పక్కన ఇంకొకటి స్లీపర్ల మీద బిగించబడి వున్నాయి, బంధీలయి వున్నాయి - అనంతానికి నిచ్చెనలా తోస్తూ.

వారం రోజులుండా మనుకుని వచ్చి ఇరవై నాలుగుగంటలవకుండా తిరుగు ప్రయాణం కారణమేమిటి. తనకే తెలీదు. నిజానికి తెలుసేమో 'ప్రశాంతత', మార్పుదల కనబడక, ఆ రెండూ ఒకరాత్రికే వున్నదీ లేనిది తెలిపోతుందా? అసలు ప్రయాణమే వృథాగా, అర్థరహితంగా తేలిపోయింది. అర్థంకి రానూ వచ్చాడు, తిరిగి వెళ్ళిపోతున్నాడు.

అరైలు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు వెనక్కి తీసుకుపోతుందో? తప్పక వస్తుంది.

అంతవరకూ -

దూరానికి వేసిన నిచ్చెనని; కేవలం ఆ పనికే పుట్టినట్లు దూరంగా మేస్తున్న ఒంటరి పశువునూ, ఏదో అపురూపమైన వస్తువన్నట్లు సుతారంగా నోట్లోని చుట్టను పట్టుకుని తలకొంచెం ఎత్తి పొగ సృష్టిస్తూ తన సృష్టికి తానే మురిసిపోతున్న పోర్టర్ని చూస్తూ ఆవులిస్తూ - "ఎదురు తెన్నులు తీయడం కన్న చేసేదేముంది?" అనుకున్నాడు. ●